ANN తెలుగు

Follow: @ANNTELUGU

REGISTERED NUMBER
APTEL/2014/58382

24-10-2025

# మహా పత్రిక

తిరుపతి, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 318 పేజీలు-04 వెల-రూ.6

PUBLISHED FROM TIRUPATI | HYDERABAD శుక్రవారం WWW.EPAPER.MAHAADAILY.COM



## మా నినాదం మేడిన్ ఇండియా కాదు..
# ఇన్వెంట్ ఇన్ తెలంగాణ

### గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా తెలంగాణ

2030 నాటికి 250 బిలియన్ డాలర్లకు చేర్చాలన్నదే లక్ష్యం

కొత్తగా రూ.లక్ష కోట్ల పెట్టుబడులు, 5 లక్షల మందికి ఉపాధి కల్పిస్తాం

'ఆస్‌బయోటెక్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ 2025'లో ప్రసంగించిన మంత్రి శ్రీధర్ బాబు

**మెల్‌బోర్న్:** లైఫ్ సైన్సెస్‌లో 2030 నాటికి కొత్తగా రూ.లక్ష కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చి 5 లక్షల మందికి ఉపాధి కల్పించేలా దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లుగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చెప్పారు. ఆస్ట్రేలియా లైఫ్ సైన్సెస్ అత్యున్నత నిర్ణాయక సంస్థ 'ఆస్‌బయోటెక్', విక్టోరియా రాష్ట్ర ప్రభుత్వం సంయుక్త నిర్వహణలో మెల్‌బోర్న్‌లో నిర్వహిస్తున్న 'ఆస్‌బయోటెక్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ 2025'లో ఆయన గురువారం కీలకోపన్యాసం చేశారు.

మిగతా 2లో

**టాప్ న్యూస్**

## రాజీనామా చేస్తా...

- పోచారం శ్రీనివాసరెడ్డి సంచలన వ్యాఖ్యలు
- నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు



02

## మాదంతా ఒకే కుటుంబం


- సీఎం రేవంత్‌కు క్షమాపణ చెప్పిన కొండా సురేఖ



02

## అర డజను పిల్లలతో...

- సంతోషంగా ఉండు
- ప్రభాస్ కు మోహన్ బాబు విషెస్



02



## జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్‌కు సున్నా..

- ప్రజలు మీకు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయం
- ఫ్యామిలీ తగాదాలు పరిష్కరించుకోలేనిది మాపై విమర్శలా?
- మాజీ మంత్రి కేటీఆర్‌కు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కౌంటర్

02



## బీజేపీకి బీటీమ్‌గా బీఆర్ఎస్

మంత్రి సీతక్క ఇంటింటి ప్రచారం

వివరాలు 2లో

# కేటీఆర్.. కడుపుకు అన్నం తింటున్నావా?

### నిజాయితీగా పనిచేస్తే బట్ట కాల్చి మీదేస్తారా?

అవినీతి.. నిర్లక్ష్యపు అధికారిని వెనకేసుకొస్తారా?

ఇదిగో ఆధారాలు.. సమాధానం చెప్పు

రెండేళ్ళుగా ఆయన మీ పాపాలనే మోస్తున్నాడు

రిజ్వీతో సర్కారుకు రూ.230 కోట్ల నష్టం..

అఖిల భారత సర్వీస్ రూల్స్ నూ ధిక్కరించాడు


ఆయన నిర్లక్ష్యపు పనిపై.. ఏడాదికాలంలో ఉన్నత అధికారులకు అనేక లేఖలు రాశా

లిక్కర్ దందాకు పేటెంట్ కల్వకుంట్ల కుటుంబమే..

ముఖ్యమంత్రిపై, మాపై నిందలు వేస్తారా?

తప్పు చేయను.. నీతి తప్పను.. మీలాగా కాదు

మంత్రి జూపల్లి కృష్ణారావు సంచలనం



**హైదరాబాద్, మహా:** కేటీఆర్ కడుపుకు అన్నం తింటున్నావా? నిజాయితీగా పనిచేసే నాపై జూబ్లీహిల్స్ ఎన్నికలున్నాయని బట్ట కాల్చి మీదేస్తారా? ఆరోపణలు చేయడానికి మనస్సాక్షి.. సిగ్గు ఉండాలి కదా? మీరు చెప్పే నిజాయితీ గల అధికారి రెండేళ్ళుగా ఏ నిర్వాకాలు చేశారో మీకు తెలుసా? హోలోగ్రామ్ కారణంగా నకిలీమద్యానికి ఆస్కారం ఉండడంతో నామినేషన్ పద్ధతిపై స్వంత నిర్ణయాలతో ఏడాదికి 40కోట్ల టెండర్లను కొనసాగిస్తున్న విషయం తెలుసా? ప్రభుత్వ ఆదేశాలు, చర్యలన్నీ తొక్కిపెట్టి.. అఖిల భారత సర్వీసు రూల్స్ నిబంధనలకు విరుద్ధంగా పనిచేసిన విషయం మీకు తెలుసా? రిజ్వీ అనేక తప్పిదాలకు పాల్పడ్డాడు.

మిగతా 2లో

## నవంబర్ 7న స్థానిక ఎన్నికలపై నిర్ణయం

- ప్రతిపక్షాల దుష్ప్రచారం తిప్పికొడదాం
- సీఎం రేవంత్ అధ్యక్షతన కేబినెట్ భేటీ

వివరాలు 2లో

## ప్రజలు కోరుకుంటే
# పార్టీ పెడతా..

### ఏపీలో మూడు, తమిళనాడులో రెండు, కేరళలో గల్లీకో పార్టీ ఉంది

పార్టీలు ఉండటం పెద్ద విషయం కాదు.. ప్రజలకు మేలు జరగాలి

రేపు నిజామాబాద్ నుంచి జనం బాట

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామిని దర్శనం



**యాదాద్రి, మహా:** ప్రజలు కోరుకుంటే తప్పకుండా తాను రాజకీయ పార్టీ పెడతానని, పార్టీ పెడితే తనకు కాదని.. ప్రజలకు మేలు జరగాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. గురువారం ఆమె యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో కవిత ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మీడియాతో కవిత మాట్లాడారు. రాజకీయ పార్టీ ఏర్పాటుపై ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ జాగృతి సివిల్ సొసైటీ సంస్థ అయినప్పటికీ అవసరమైతే రాజకీయాల గురించి తాను పుష్కలంగా మాట్లాడతానని చెప్పుకొచ్చారు. రాజకీయాల గురించి తెలంగాణ జాగృతి తరఫున మాట్లాడాలంటే రాజకీయ పార్టీగానే ఉండాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. పార్టీ రావాలని ప్రజలు కోరుకుంటే తప్పకుండా వస్తానని... అందులో ఇబ్బందేమీ లేదని పేర్కొన్నారు.

మిగతా 3లో

## బిజెపి ఆందోళన .. ఉద్రిక్తత

గోరక్షక్ కార్యకర్త మీద కాల్పుల ఘటనపై సీరియస్

వివరాలు 3లో



## ఆ రెండు పార్టీలు జూబ్లీహిల్స్ కు ఏం చేయలే

### బీఆర్ఎస్, కాంగ్రెస్ లపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఫైర్

**జూబ్లీహిల్స్:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి , ఎమ్మెల్యే అభ్యర్థి లంకల దీపక్ తో కలిసి వెంగల్ రావు నగర్ డివిజన్, మధురానగర్‌లో ఇంటింటి ప్రచారం

మిగతా 2లో



## జూబ్లీహిల్స్‌లో విజయం మనదే

బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో కేసీఆర్...

ప్రభుత్వ వైఫల్యాలు ప్రచారం చేయాలని సూచన

**గజ్వేల్, మహా:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మాగంటి సునీత గోపీనాథ్ గెలుపును ప్రజలు ఇప్పటికే ఖాయం చేశారని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నేతలు ప్రజల వద్దకు వెళ్లి వారితో మమేకమై కాంగ్రెస్ దుష్ట పాలన పట్ల మరింత అవగాహన కల్పించి భారీ మెజారిటీ కోసం గట్టి ప్రయత్నం చేయాల్సి ఉన్నదని పార్టీ నేతలకు పునరుద్ఘాటించారు. నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ దోపిడీ పాలనతో ఇప్పటికే రాష్ట్రం గుల్ల గుల్ల అయ్యిందని, ఇక జూబ్లీహిల్స్‌లో

మిగతా 2లో

## బిహార్‌లో ఆర్జేడీదే హవా


ప్రత్యేక కథనం 4లో

## బాలకృష్ణ తాగి అసెంబ్లీకి వచ్చాడు

### జగన్ సంచలన వ్యాఖ్యలు

గూగుల్ క్రెడిట్ మాదే.. అది మా పునాదే

అదానీ వల్లే ఇది సాధ్యమైంది.. క్రెడిట్ ఇవ్వడం బాబుకు నచ్చదు



**అమరావతి, మహా :** "బాలకృష్ణ తాగి వచ్చి అసెంబ్లీలో మాట్లాడారు. తాగిన వ్యక్తిని అసెంబ్లీకి ఎలా అనుమతిచ్చారు?" అని వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి ప్రశ్నించారు. బాలకృష్ణ చేసిన సంభాషణలు 'పనీపాట లేనివి' అని, "అసెంబ్లీలో మాట్లాడాల్సింది ఏంటి? ఆయన మాట్లాడిందేంటి?" అని నిలదీశారు. దీని ద్వారా బాలకృష్ణ మానసిక పరిస్థితి ఏంటో అర్థమవుతోంది అంటూ

మిగతా 2లో





# రాజీనామా చేస్తా

**పోచారం శ్రీనివాసరెడ్డి సంచలన వ్యాఖ్యలు**

నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు

**కామారెడ్డి, మహా :** మాజీ సభాపతి, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. బాన్సువాడ అభివృద్ధి కోసమే సీఎం రేవంత్ రెడ్డిని కలిసినట్లు చెప్పారు. నా స్వార్థం కోసం కలిసి ఉంటే చెప్పుతో కొట్టండి అని కీలక వ్యాఖ్యలు చేశారు. అవసరం అయితే రాజీనామాకు కూడా తాను సిద్ధమే అని ప్రకటించారు. ప్రజలకు హానీ కలిగించే పని జీవితంలో చేయబోను అని అన్నారు. ప్రజా సేవ చేసేందుకు రాజకీయాల్లో కొనసాగుతున్నానని చెప్పారు. ప్రజలే నా కుటుంబసభ్యులుగా భావిస్తానని అన్నారు. ఉన్నంతకాలం ఇలాగే జీవిస్తా అని స్పష్టం చేశారు. కానీ కొంతమంది కావాలనే నా మీద బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. ఏదో ఆశించి సీఎం రేవంత్ రెడ్డిని కలిశానని నెగిటివ్‌గా నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వ్యక్తిగతంగా నా కోసం ఇప్పటివరకు సీఎం రేవంత్‌ని ఏదైనా అడిగినట్లు నిరూపిస్తే క్షణం ఆలోచించకుండా రాజీనామా చేస్తానని పోచారం శ్రీనివాస రెడ్డి అన్నారు. తాను బీఆర్ఎస్ పార్టీ నుంచే పోటీ చేసి గెలిచానని వెల్లడించారు.



# మాదంతా ఒకే కుటుంబం

**సీఎం రేవంత్‌కు క్షమాపణ చెప్పిన కొండా సురేఖ**

**హైదరాబాద్, మహా:** మంత్రుల మధ్య విభేదాలు లేవని, తమదంతా ఒకే కుటుంబమని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి కొండా సురేఖ క్షమాపణలు చెప్పారు. గురువారం సాయంత్రం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. తమ ఇంటికి పోలీసులు రావడంతో కూతురు సుష్మిత ఆవేశంతో మాట్లాడింది. మా కూతురు తరపున నేను క్షమాపణ అడుతున్నాను. ప్రస్తుతం మా మధ్య ఎలాంటి విభేదాలు లేవు.. త్వరలోనే అన్నీ సమసిపోతాయని కొండా సురేఖ స్పష్టం చేశారు. తామంతా కాంగ్రెస్ గొడుగు కిందే కుటుంబంలా పనిచేస్తామన్నారు.

# బాలకృష్ణ తాగి అసెంబ్లీకి వచ్చాడు

**జగన్ సంచలన వ్యాఖ్యలు.. గూగుల్ క్రెడిట్ మాదే.. అది మా పునాదే..**

అదానీ వల్లే ఇది సాధ్యమైంది.. క్రెడిట్ ఇవ్వడం బాబుకు నచ్చదు

(మొదటిపేజీ తరువాయి)

ఆయన ఆరోగ్య పరిస్థితిపై అనుమానాలు వ్యక్తం చేశారు. నకిలీ మద్యం గురించి ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నందమూరి బాలకృష్ణపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బాలకృష్ణ అసెంబ్లీలో ప్రవర్తించిన తీరును, ఆయన చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ, ఘాటు విమర్శలు గుప్పించారు. అంతేకాకుండా, తాగిన వ్యక్తిని అసెంబ్లీలోకి అనుమతించినందుకు స్పీకర్‌పైనా జగన్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. "తాగిన వారిని అసెంబ్లీలోకి అనుమతించిన స్పీకర్‌కు బుద్ధి లేదు," అంటూ వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో ఆ విధంగా మాట్లాడుతున్నారు అంటే, బాలకృష్ణ సైకలాజికల్ హెల్త్ ఎలా ఉందో చూసుకోవాలి అని జగన్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో, సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

**గూగుల్ క్రెడిట్ మాదే.. అది మా పునాదే**

ఇక యాడ్ ఏజెన్సీల రాష్ట్ర ప్రభుత్వ పాలన అని మాజీ సీఎం జగన్ విమర్శించారు.. మాటలు చూస్తే కోటలు దాటుతున్నాయి.. పెర్ఫార్మెన్స్ మాత్రం వీక్ అన్నారు.. వేరే వాళ్ళకు దొరకాల్సిన క్రెడిట్ చోరీలో మాత్రం చంద్రబాబు పీక్ అని విమర్శించారు.. గత ప్రభుత్వ హయాంలో ఇంటర్నేషనల్ హబ్ గా విశాఖను తీర్చిదిద్దే పనిలో భాగంగా అదానీ డేటా సెంటర్‌కు బీజం పడిందని తెలిపారు. సింగపూర్ నుంచి సబ్సీ కేబుల్ తీసుకువచ్చే కార్యక్రమానికి అంకురార్పణ కూడా అప్పుడే జరిగిందని చెప్పారు.. సబ్సీ కేబుల్ తీసుకు రాకపోతే ఏ డేటా రాదని.. అదానీ డేటా సెంటర్ కు ఫౌండేషన్ వేయటం వల్లే ఇది సాధ్యమైందన్నారు.. ఇది జరగటానికి వైసీపీ, అదానీ, కేంద్రం, సింగపూర్ చేసిన కృషి వల్లే ఇవాళ గూగుల్ విశాఖ వచ్చిందని కొనియాడారు.. ఆరోజు వైసీపీ కృషి వల్లే ఇప్పుడు గూగుల్ రావటానికి మార్గమైందని వెల్లడించారు. అదానీ పెట్టిన ప్రాజెక్టుకు ఇది విస్తరణ.. అక్టోబర్ 2022 నుంచి అదానీకి.. గూగుల్ కు బిజినెస్ రిలేషన్ షిప్ ఉందని మాజీ సీఎం వైఎస్ జగన్ తెలిపారు.. ఈ నేపథ్యంలోనే విశాఖలో మే 2023 లో ఫౌండేషన్ స్టోన్ వేశామన్నారు.. సబ్సీ కేబుల్ కు అంకురార్పణ కూడా అప్పుడే జరిగిందని తెలిపారు. సముద్ర గర్భంలో సింగపూర్ నుంచి విశాఖ వరకు అదానీ సబ్సీ కేబుల్ వేయటం వల్లే గూగుల్ వచ్చిందని మాజీ సీఎం జగన్ వివరించారు.. ఆ రెండు కంపెనీలు వ్యాపార భాగస్వాములు కాబట్టే డేటా సెంటర్ విశాఖ వచ్చిందన్నారు.. 300 మెగావాట్ల డేట్ సెంటర్ కు అప్పుడు వైసీపీ వేసిన అడుగుల వల్లే సాధ్యమైందన్నారు..





**అదానీకి థ్యాంక్స్ చెప్పారా.. హైదరాబాద్ ది కూడా సేమ్ స్టోరీ**

"అదానీ ఇన్ఫ్రా కు సంబంధించిన వాళ్ళే ఈ డేటా సెంటర్ నిర్మిస్తున్నారు.. గూగుల్ నుంచి అలెగ్జాండర్ స్మిత్ ఐటీ సెక్రటరీ గా ఉన్న భాస్కర్ కు ఓ లెటర్ కూడా రాశారు.. అదానీ కి చెందిన మూడు కంపెనీలకు ల్యాండ్ అలాట్ చేయాలని కోరారు.. ఈ ప్రాజెక్ట్ తేవటం కోసం 87 వేల కోట్లు అదానీ ఖర్చు చేసి గూగుల్ ని తీసుకువస్తునారు.. అదానీ 10 మిలియన్ డాలర్లు ఖర్చు చేస్తేనే గూగుల్ వస్తుంది.. ఇలాంటి డేటా సెంటర్ అదానీ లాంటి మన దేశీయ కంపెనీ పెడుతుందని గర్వంగా చెప్పుకోవాలి.. క్రెడిట్ ఎవరికి ఇవ్వాలి.. కనీసం అదానీ కి ఒక థాంక్స్ అయినా చెప్పారా.. ఇదంతా చెప్తే జగన్ ప్రభుత్వం లోనే జరిగిందని క్రెడిట్ ఇవ్వడం చంద్రబాబు కు ఇష్టం లేదు.. డేటా సెంటర్ లో అతిముఖ్యమైన అంశం సముద్ర గర్భంలో వేస్తున్న కేబుల్.. 3900 కిలోమీటర్ల మేరా కేబుల్ వేయాలి.. అంతా పూర్తయిన తర్వాత చంద్రబాబు సుందర ముఖారవిందాన్ని చూసి వీళ్ళు వచ్చినట్లు చెప్పుకుంటున్నారు.. గతంలో 300 మెగావాట్ల డేటా సెంటర్ కోసం భూ కేటాయింపులు చేశాం.. ప్రపంచాన్ని శాసించబోయే టెక్నాలజీ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్.. వీటికి డేట్ సెంటర్ కీ ఫ్యాక్టర్ గా పనిచేస్తుంది.. 300 మెగావాట్ల డేటా సెంటర్ పెడితే 25 వేల ఉద్యోగాలు ఇవ్వాలని కోరాం.. ఐటీ పార్క్, స్కిల్ యూనివర్సిటీ పెట్టాలని కోరాం.. చంద్రబాబు ఇలా చేయటం కొత్త కాదు.. హైదరాబాద్ విషయంలో కూడా చంద్రబాబుది సేమ్ స్టోరీ.. మాదాపూర్ సైబర్ టవర్స్ ఆరెకరాల స్థలంలో వచ్చిన చిన్న ప్రాజెక్ట్.. దీనికి పునాది రాయి వేసింది ముఖ్యమంత్రిగా ఉన్న ఎన్ జనార్ధన్ రెడ్డి.. ఆ తర్వాత ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు దాన్ని ప్రైవేట్ వాళ్లకు ఇచ్చి కట్టించాడు.. ఆ బిల్డింగ్ ఒకటి కట్టి హైదరాబాద్ మొత్తం నేనే కట్టాను అని ప్రొజెక్షన్ చేసుకున్నాడు.. 2004, 2009 వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా గెలిచారు.. 2014, 2019 లో కేసీఆర్ గెలిచాడు.. అయిన ఈ 20 ఏళ్ల అభివృద్ధి నాదే అంటాడు.. ఒక్క బిల్డింగ్ కట్టి అభివృద్ధి మొత్తం నాదే అనటం మూర్ఖత్వం.. వైఎస్ఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఓఆర్ఆర్, పీవీ ఎక్స్ ప్రెస్ హైవే, శంషాబాద్ ఎయిర్పోర్ట్ ఇవన్నీ వచ్చాయి కాబట్టే హైదరాబాద్ అంతలా అభివృద్ధి చెందింది.. ఐటీ ఎక్స్పోర్ట్స్ కూడా చంద్రబాబు దిగిపోయిన తర్వాత భారీగా పెరిగాయి.. 2009 నాటికి 5600 కోట్ల నుంచి 39 వేల కోట్లకు ఐటీ ఎగుమతులు దాటాయి.. 2014 నాటికి 56 వేలకోట్లు దాటాయి.. వేరే వాళ్ళు చేస్తే ఆ క్రెడిట్ వాళ్లకు ఇవ్వాలి.. కేసీఆర్ వచ్చిన తర్వాత గొప్ప పరిపాలన చేశారు కాబట్టే అభివృద్ధి సాధ్యం అయ్యింది.. కేసీఆర్ 2 లక్షల కోట్లకు పైగా ఐటీ ఎగుమతులు తీసుకువెళ్ళారు.. 2004 లో పాలన వదిలేసి ఇప్పటికీ అంతా నేనే వేశా అని చెప్పుకునే చంద్రబాబు.. విశాఖ దేశంలోని ఇతర మెట్రో నగరాలను తలదన్నేలా అడుగులు వేశాం.. భోగాపురం ఎయిర్ పోర్టు కు మేమే అన్నీ చేశాం.. మరో ఏడాదిలో పూర్తి కూడా అవుతుంది.. ఉత్తరాంధ్ర దశ దిశ మార్చటం కోసం పోర్టు నిర్మాణం చేపట్టాం.." అని మాజీ సీఎం జగన్ వ్యాఖ్యానించారు.

# మా నినాదం మేడిన్ ఇండియా కాదు.. ఇన్వెంట్ ఇన్ తెలంగాణ

**గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా తెలంగాణ**

2030 నాటికి 250 బిలియన్ డాలర్లకు చేర్చాలన్నదే లక్ష్యం

కొత్తగా రూ.లక్ష కోట్ల పెట్టుబడులు, 5 లక్షల మందికి ఉపాధి కల్పిస్తాం

'ఆస్‌బయోటెక్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ 2025'లో ప్రసంగించిన మంత్రి శ్రీధర్ బాబు

(మొదటిపేజీ తరువాయి)

రెండేళ్లలో తెలంగాణ లైఫ్ సైన్సెస్ రంగం సాధించిన పురోగతి, భవిష్యత్తు ప్రణాళికలు, అవకాశాలు, పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అనుకూలతలను ఈ సందర్భంగా ఆయన వివరించారు. తెలంగాణను "గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్"గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున తీసుకుంటున్న చర్యలను మంత్రి వెల్లడించారు. భౌగోళికంగా 11వ స్థానం, జనాభాలో 12వ స్థానంలో ఉన్నప్పటికీ, దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో తెలంగాణ వాటా 5 శాతం కంటే ఎక్కువగా ఉందని మంత్రి శ్రీ శ్రీధర్ బాబు తెలిపారు. 20242025లో తెలంగాణ జీఎస్ డీపీ వృద్ధి రేటు 8.2 శాతం కాగా, జాతీయ సగటు కేవలం 7.6 శాతం మాత్రమే ఉందన్నారు. గత 20 నెలల కాలంలో కొత్తగా రూ.3.2 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రాగా, ఇందులో లైఫ్ సైన్సెస్ రంగం వాటా రూ.63వేల కోట్లు అని చెప్పారు. లైఫ్ సైన్సెస్ ఎగుమతులు గతేడాది ఏప్రిల్ -డిసెంబర్ మధ్య కాలంలోనే రూ.26వేల కోట్ల మార్కును దాటాయన్నారు.

**త్వరలోనే కాంప్రహెన్సివ్ లైఫ్ సైన్సెస్ పాలసీ..**

తెలంగాణ లైఫ్ సైన్సెస్ రంగం ఆర్థిక వ్యవస్థ విలువను ప్రస్తుతం ఉన్న 80 బిలియన్ డాలర్ల నుంచి 2030 నాటికి 250 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇందుకోసం త్వరలోనే "కాంప్రహెన్సివ్ లైఫ్ సైన్సెస్ పాలసీ"ని అందుబాటులోకి తెస్తామన్నారు. మా నినాదం మేడిన్ ఇండియా కాదు... ఇన్వెంట్ ఇన్ తెలంగాణ అని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. లైఫ్ సైన్సెస్ పరిశ్రమల ఏర్పాటుకు అనువైన "ఎకో సిస్టం" తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేస్తుందన్నారు. జీనోమ్ వ్యాలీ, మెడికల్ డివైసెస్ పార్క్, బీ హబ్, భారత్ ఫ్యూచర్ సిటీ, పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించే ప్రగతిశీల, ప్రోత్సాహకర విధానాలు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, ప్లగ్అండ్‌ప్లే పారిశ్రామిక పార్కులు, అనుమతుల కోసం సింగిల్ విండో సిస్టమ్, దేశంలోనే సాటి లేని స్టెమ్ టాలెంట్, స్థిరమైన ప్రభుత్వం, సమర్థవంతమైన నాయకత్వం, ఎక్కడైనా సులభంగా చేరుకునేలా రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో విక్టోరియా రాష్ట్ర మంత్రులు రోస్ స్పెన్స్, డానీ పియర్సన్ ఎంపీ, ఆస్ బయోటెక్ ఛైర్మన్ డా. జేమ్స్ క్యాంప్‌బెల్, తెలంగాణ ఇన్వెస్ట్మెంట్ సెల్ డైరెక్టర్ మధుసూదన్, తెలంగాణ లైఫ్ సైన్సెస్ ఫౌండేషన్ సీఈవో శక్తి నాగప్పన్ తదితరులు పాల్గొన్నారు.



# కేటీఆర్.. కడుపుకు అన్నం తింటున్నావా?

(మొదటిపేజీ తరువాయి)

డిస్టిలరీల విషయంలో నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వానికి ఏడాదికి రూ.230కోట్ల నష్టం వాటిల్లింది. ఇంకా నష్టం జరుగుతోంది. ఒకటి కాదు.. పదుల నిర్ణయాలు ప్రజాధనానికి గండిపెట్టినవి.. పాత ప్రభుత్వంలోని దందాలు కొనసాగించినవి అంటూ రాష్ట్ర ఎక్సైజ్ శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం రాత్రి మంత్రివర్గ సమావేశం అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ఎంపీ బలరాం నాయక్ తదితరులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రిజ్వీ పనితీరుపై గత ఏడాది ఆగస్టు నుండి లేఖలు రాస్తున్నానని, ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చూడాలని, కమిటీ వేసి ఛైర్మన్ పదవి అప్పగించినా ఏనాడూ విధులు నిర్వర్తించలేదన్నారు. అలాంటపుడు ఉన్నతాధికారికి లేఖలు రాశామన్నారు. తమ లేఖ వల్ల ఆయన ఉద్యోగానికి రాజీనామా చేయలేదని, ఎక్కువ జీతం వస్తుందని ప్రైవేట్ ఉద్యోగం చూసుకున్నాడన్నారు. గత నెల 11వ తేదీన తాను సీఎస్ కు లేఖ రాశానని, ఇపుడు కొత్తగా రాసింద కాదన్నారు. అపుడే వీఆర్ఎస్ కు దరఖాస్తు చేస్తున్నారని తెలిసి.. ఇలాంటి నిర్లక్ష్యపు అధికారులపై విచారణ జరగాలని రాశానన్నారు. తాను తప్పుచేయనని, నిజాయితీగా ఉంటానని.. ఏ అంశంపైనైనా చర్చకు సిద్ధమన్నారు. తాను ఏడుసార్లు గెలిచానని, వైఎస్ రాజశేఖర్ రెడ్డి, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి, కేసీఆర్, ప్రస్తుతం రేవంత్ రెడ్డి మంత్రివర్గాల్లో మంత్రిగా ఉన్నానన్నారు. తాను నిజాయితీగా ఉంటానని, ఎపుడూ అబద్ధం చెప్పనని, అబద్ధపు హామీలు ఇవ్వనన్నారు.

**జూబ్లీహిల్స్ ఎన్నికలు ఉన్నాయని..**

జూబ్లీహిల్స్ ఎన్నికలు వచ్చాయని, సంబంధం లేని అంశాన్ని తీసుకొచ్చి ఈ వ్యవహారాలతో సంబంధం లేని ముఖ్యమంత్రి పైన, ఆయన కుటుంబం పైన, తన కుటుంబం పైనా చిల్లర ఆరోపణలు చేస్తున్నారని మంత్రి జూపల్లి మండిపడ్డారు. లిక్కర్ దందాకు పేటెంట్ కల్వకుంట్ల కుటుంబమేనని, ఢిల్లీలో అరెస్టయి.. బిజెపి దగ్గర మోకరిల్లి ఏం చేసి వచ్చారో అందరికీ తెలుసన్నారు. తెలంగాణ రాకముందు కేసీఆర్, కేటీఆర్, హరీష్, కవిత, సంతోష్ ల ఆర్థిక స్థితి ఏంటి.. ఇపుడు ఏంటి అన్న విషయం ప్రజలకు తెలుసునని, చెప్పాలంటే వందలున్నాయని.. విధులపై నిర్లక్ష్యం వహించేవారిని ప్రశ్నిస్తే అడ్డగోలు ఆరోపణలు చేస్తే మంచిదికాదన్నారు. తాను నిజాయితీగా ఉంటాను కాబట్టి పిచ్చి ఆరోపణలకు బాధపడుతున్నానని, ఇలాంటి ఆరోపణలు చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

# బీజేపీకి బీటీమ్‌గా బీఆర్ఎస్

**మంత్రి సీతక్క ఇంటింటి ప్రచారం**

**జూబ్లీహిల్స్:** కాంగ్రెస్‌కు వస్తున్న ప్రజాస్పందన ఓర్వలేక బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని మంత్రి సీతక్క ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని మంత్రి సీతక్క ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క మీడియాతో మాట్లాడుతూ.. గత మూడు రోజులుగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని అన్నారు. గడపగడపకు వెళ్లి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను ఆశీర్వదించాలని కోరారు. తమ ప్రచారానికి మంచి ప్రజా స్పందన వస్తుందని, ప్రజా స్పందన చూస్తుంటే నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో గెలవడం ఖాయం అని జోస్యం చెప్పారు. నవీన్ యాదవ్ గెలుపు లాంచనమేనని, బీజేపీకి బీ టీమ్ గా బీఆర్ఎస్ పని చేస్తుందని ఆరోపించారు. ఇక జూబ్లీహిల్స్ గల్లీలో పుట్టి పెరిగిన యువకుడు నవీన్ యాదవ్ కు ఒక అవకాశం ఇవ్వాలని ఓటర్లకు మంత్రి విజ్ఞప్తి చేశారు.

# జూబ్లీహిల్స్‌లో విజయం మనదే

**బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో కేసీఆర్...**

**ప్రభుత్వ వైఫల్యాలు ప్రచారం చేయాలని సూచన**

(మొదటిపేజీ తరువాయి)

తన అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ ఓ రౌడీషీటర్‌ను నిలబెట్టి హైదరాబాద్ ప్రజల విజ్ఞతకు కఠిన పరీక్ష పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. విజ్ఞులైన జూబ్లీ హిల్స్ ప్రజలు కాంగ్రెస్ పార్టీ నిలబెట్టిన రౌడీషీటర్ ఫ్యామిలీ నుంచి వచ్చిన అభ్యర్థిని చిత్తుగా ఓడించి, జూబ్లీహిల్స్ గౌరవాన్ని హైదరాబాద్‌లో శాంతి భద్రతలను కాపాడుకుంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల నేపథ్యంలో పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన ఎర్రవెల్లిలో సన్నాహక సమావేశం జరిగింది.

**హాజరైన పార్టీ కీలక నేతలు**

ఈ సమావేశంలో పోటీలో ఉన్న అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ సహా, ఉప ఎన్నిక కోఆర్డినేటర్లుగా ఉన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా పార్టీ సీనియర్ నేతలు మాజీ మంత్రులు ఎమ్మెల్యేలు... హరీష్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎమ్మెల్సీ మహమూద్ అలీ, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, సబితా ఇంద్రారెడ్డి, జి జగదీశ్ రెడ్డి, లక్ష్మారెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, చామకూర మల్లారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, పాల్గొన్నారు. వీరితో పాటు జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్ల, క్లస్టర్ల ఇంచార్జులు పాల్గొన్నారు. వారిలో బిఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ చైర్మన్లు, పార్టీ సీనియర్ నేతలు, ముఖ్య నేతలు, స్థానిక కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, తదితర పార్టీ కీలక నేతలు పాల్గొన్నారు.

**ఇప్పుడు ఎందుకు మాయమయ్యాయి..?**

ఈ సమావేశం సందర్భంగా పార్టీ అభ్యర్థి గెలుపు దిశగా ఇప్పటికే ప్రజల్లో సానుకూల స్పందన వ్యక్తమవుతున్న నేపథ్యంలో... క్షేత్రస్థాయిలో ఇప్పటిదాకా కొనసాగుతున్న ప్రచారం సంబంధిత అంశాల మీద అధినేత కు ఇంచార్జీలు రిపోర్ట్ చేశారు. పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ భారీ మెజారిటీతో గెలుపు కోసం అనుసరించాల్సిన వ్యూహాలు ఎత్తుగడలు, కార్యాచరణకు సంబంధించి, అధినేత కేసీఆర్ సమావేశంలో సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో రాష్ట్రంలో దిగజారిన అభివృద్ధి గురించి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో తలెత్తిన ప్రమాదకర పరిస్థితులను గురించి వారికి ఇంటింటికీ తిరిగి వివరించాలని పార్టీ నేతలకు అధినేత కేసీఆర్ ఉద్బోధించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనాకాలంలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, మానవీయ కోణంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఎందుకు మాయమయ్యాయనే విషయాన్ని ప్రజలతో కలిసి చర్చించాలని అధినేత కేసీఆర్ సూచించారు.

# నవంబర్ 7న స్థానిక ఎన్నికలపై నిర్ణయం

ప్రతిపక్షాల దుష్ప్రచారం తిప్పికొడదాం

సీఎం రేవంత్ అధ్యక్షతన కేబినెట్ భేటీ

**హైదరాబాద్, మహా :** తెలంగాణ మంత్రివర్గ సమావేశం గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ప్రధానంగా స్థానిక ఎన్నికలు, బీసీ రిజర్వేషన్లపై చర్చించారు. ఇటీవల కాలంలో మంత్రుల మీద అనవసరంగా ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు, దుష్ప్రచారాన్ని బలంగా తిప్పికొట్టాలని నిర్ణయించారు. ఈ సమావేశం అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీసీలకు 42% రిజర్వేషన్లపై నవంబర్ 3న హైకోర్టు తీర్పు వెలువడిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. దీనిపై నవంబర్ 7న మరోసారి కేబినెట్ భేటీ నిర్వహిస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ ఆర్డినెన్స్‌ను త్వరలోనే గవర్నర్ కు పంపనున్నట్లు వెల్లడించారు. మంత్రులందరూ అపోహలకు తావులేకుండా ఐక్యంగా తిప్పికొట్టాలన్నారు.



ఆ రెండు పార్టీలు జూబ్లీహిల్స్ కు

# ఏం చేయలే

**బీఆర్ఎస్, కాంగ్రెస్ లపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఫైర్**

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు. గత 10 సంవత్సరాలలో బిఆర్ఎస్ ప్రభుత్వం, రెండేళ్ల నుంచి ఉన్న కాంగ్రెస్ సర్కార్ జూబ్లీహిల్స్ కి చేసింది ఏమి లేదని, బీజేపీ తోనే అభివృద్ధి అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. అనంతరం యూసుఫ్‌గూడా డివిజన్‌లోని వెంకటగిరి లో పాదయాత్రలో పాల్గొని వెంకటగిరి పరిసర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్ర రెడ్డి నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.


# నవంబర్ 7న స్థానిక ఎన్నికలపై నిర్ణయం

**ప్రతిపక్షాల దుష్ప్రచారం తిప్పికొడదాం.. సీఎం రేవంత్ అధ్యక్షతన కేబినెట్ భేటీ**

**హైదరాబాద్, మహా:** తెలంగాణ మంత్రివర్గ సమావేశం గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ప్రధానంగా స్థానిక ఎన్నికలు, బీసీ రిజర్వేషన్లపై చర్చించారు. ఇటీవల కాలంలో మంత్రుల మీద అనవసరంగా ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు, దుష్ప్రచారాన్ని బలంగా తిప్పికొట్టాలని నిర్ణయించారు. ఈ సమావేశం అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీసీలకు 42% రిజర్వేషన్లపై నవంబర్ 3న హైకోర్టు తీర్పు వెలువడిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. దీనిపై నవంబర్ 7న మరోసారి కేబినెట్ భేటీ నిర్వహిస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ ఆర్డినెన్స్‌ను త్వరలోనే గవర్నర్ కు పంపనున్నట్లు వెల్లడించారు. మంత్రులందరూ అపోహలకు తావులేకుండా ఐక్యంగా తిప్పికొట్టాలన్నారు.


# అర డజను పిల్లలతో సంతోషంగా ఉండు

**ప్రభాస్‌కు మోహన్ బాబు విషెస్**

**హైదరాబాద్, మహా:** రెబెల్ స్టార్ ప్రభాస్‌కు జన్మదిన శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా కలెక్షన్ కింగ్ మోహన్ బాబు చేసిన బర్త్‌డే విషెస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మోహన్ బాబు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ.. "మై డియర్ డార్లింగ్ బావా".. "నువ్వు సినీ జాతి మొత్తానికి ఒక గర్వకారణం," అంటూ ప్రశంసించారు. ఈ సందర్భంగా ప్రభాస్ పెళ్లి గురించి మోహన్ బాబు ఫన్నీగా ప్రస్తావించారు. నువ్వు త్వరగా పెళ్లి చేసుకుని, నీకు అరడజన్ నుంచి ఏకంగా ఒక డజన్ మంది పిల్లలు కూడా కలగాలని.. సంతోషమైన జీవితాన్ని గడపాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నాను. ఎప్పటికీ ఈ బావ నిన్ను ప్రేమిస్తూనే ఉంటాడు" అని పేర్కొన్నారు. మోహన్ బాబు చేసిన ఈ సరదా వ్యాఖ్యలు నెట్టింట ఫన్నీ కామెంట్స్‌కు దారి తీశాయి.

# జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్‌కు సున్నా..

**ప్రజలు మీకు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయం**

ఫ్యామిలీ తగాదాలు పరిష్కరించుకోలేనిది మాపై విమర్శలా?

మాజీ మంత్రి కేటీఆర్‌కు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కౌంటర్

**నిజామాబాద్, మహా:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కౌంటర్ ఇచ్చారు. పదేళ్ల బీఆర్ఎస్ నిరంకుశ పాలనను ప్రజలు మర్చిపోలేదని, బీఆర్ఎస్‌ను తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కుటుంబ తగాదాలు పరిష్కరించుకోలేని కేటీఆర్.. కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని, ముందు కవిత మాటలకు కేటీఆర్ సమాధానం చెప్పాలన్నారు. గురువారం నిజామాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. అధికారంలో ఉండగా బీఆర్ఎస్ ఆరాచక పాలన చేసింది కాబట్టే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించారని, పార్లమెంట్ ఎన్నికల్లో సున్నా సీట్లు ఇచ్చారని రేపు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కూడా సున్నా రాబోతోందన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలు బీఆర్ఎస్‌కు కర్రుకాల్చి వాత పెట్టబోతున్నారని చెప్పారు. అన్ని ప్రాంతాలను ఈ ప్రభుత్వం సమానంగా చూస్తోందని, పదేండ్ల కాలంలో బీఆర్ఎస్ చెప్పుకోదగ్గ కార్యక్రమం ఏదైనా చేసిందా అని ప్రశ్నించారు. నిజామాబాద్ ను మరింత అభివృద్ధి చేస్తామని, రైల్వే ఓవర్ బ్రిడ్జి కోసం కేంద్రం నిధులు పెండింగ్ లో ఉన్నాయన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరు పాదయాత్రలు చేసినా స్వాగతిస్తామని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఈనెల 25 నుంచి జాగృతి జనం బాట పేరుతో కవిత రాష్ట్రవ్యాప్త పర్యటన చేయబోతున్న నేపథ్యంలో మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ప్రజాసమస్యలపై కవిత పాదయాత్ర చేయడం సంతోషం అన్నారు. అయితే పదేళ్లపాటు తెలంగాణను దోచుకున్న ముఠాలో కవిత లేరా అని ప్రశ్నించారు. కేబినెట్ లో మైనారిటీకి అవకాశం ఉంటుందన్నారు.



# ప్రజలు కోరుకుంటే పార్టీ పెడతా..

## ఏపీలో మూడు, తమిళనాడులో రెండు, కేరళలో గల్లీకో పార్టీ ఉంది

పార్టీలు ఉండటం పెద్ద విషయం కాదు.. ప్రజలకు మేలు జరగాలి

రేపు నిజామాబాద్ నుంచి జనం బాట

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామిని దర్శనం



**(మొదటిపేజీ తరువాయి)**

ఏపీలో మూడు, తమిళనాడులో రెండు ప్రాంతీయ పార్టీలు ఉన్నాయని తెలిపారు. కేరళలో గల్లీకి ఒక పార్టీ ఉందని గుర్తుచేశారు. పార్టీలు ఉండటం పెద్ద విషయం కాదని... ఆయా పార్టీలతో ప్రజలకు మేలు జరగాలని సూచించారు. తాను చేపడుతున్న కార్యక్రమాలపై ప్రజాభిప్రాయం తెలుసుకోవటానికే 'జనం బాట' కార్యక్రమం నిర్వహిస్తున్నానని కవిత తెలిపారు. రేపటి నుంచి 4నెలల పాటు 'జనం బాట' కార్యక్రమం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో అన్ని వర్గాలను కలిసి వారి సమస్యలు తెలుసుకుంటానని వెల్లడించారు. 'జనం బాట' కార్యక్రమానికి లక్ష్మీ నరసింహస్వామి ఆశీస్సుల కోసమే తాను ఇక్కడకి వచ్చానని చెప్పుకొచ్చారు. మొన్న తిరుపతి, ఇప్పుడు యాదాద్రి దేవాలయాలను దర్శించుకున్నానని తెలిపారు.

### ప్రతి జిల్లాలో రెండు రోజుల పాటు ఉంటా..

ప్రజా సమస్యలను అర్థం చేసుకునే శక్తి దేవుడు తనకు ఇవ్వాలనే దైవ దర్శనం చేసుకుంటున్నానని కవిత వివరించారు. ఈ నెల 25వ తేదీన తమ సొంతూరు నిజామాబాద్ నుంచి 'జనం బాట' కార్యక్రమం ప్రారంభిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమం 33జిల్లాల్లో 4నెలలు పాటు జరుగుతుందని వివరించారు. తాను ప్రతి జిల్లాలో రెండు రోజుల పాటు ఉంటానని.. అక్కడి సమస్యలు తెలుసుకుంటానని చెప్పుకొచ్చారు. మేధావులు, విద్యావంతులు, రైతులు, యువత, మహిళలు ఇలా అన్ని వర్గాలను కలుస్తానని వెల్లడించారు. ప్రజాసమస్యలను ఏవిధంగా పరిష్కారం చేయాలనే విషయంపై దృష్టి పెడతానని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మాజీ సీఎం కేసీఆర్ యాదాద్రిని చక్కగా పునర్నిర్మించారని ఉద్ఘాటించారు. యాదాద్రి గుడి ప్రాశస్త్యాన్ని కాపాడే విధంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రయత్నం చేయాలని సూచించారు. తాను యాదాద్రి ఆలయానికి వస్తుంటే విచిత్రమైన హోర్డింగ్‌లను చూశానని... అలాకాకుండా తిరుమలలో మాదిరిగా స్వామి వారి హోర్డింగ్‌లు, చిత్రపటలే ఇక్కడ ఉండేలా చూడాలని కోరారు. మళ్లీ యాదాద్రికి తాను వస్తానని... అప్పుడు ఇక్కడున్న అన్ని సమస్యలపై వివరంగా మాట్లాడతానని చెప్పుకొచ్చారు. తెలంగాణ జాగృతి ఎన్జీవోగా ఆవిర్భవించి 19 ఏళ్లుగా కొనసాగుతోందని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా రాజకీయాలు, రాజకీయ సమీకరణాల గురించి తాను మాట్లాడానని పేర్కొన్నారు.

# రైతులు కొనుగోలు కేంద్రం లోనే ధాన్యం అమ్ముకోవాలి

## జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**యాదగిరిగుట్ట, మహా:** రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలోనే అమ్ముకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. గురువారం యాదగిరిగుట్ట మండలం మల్లాపురం గ్రామంలో ఐ కే పి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు... ఈ రోజు ఎన్ని ధాన్యం కుప్పలు వచ్చాయని,అన్ని కుప్పలను తేమ శాతన్ని చెక్ చేస్తున్నారా... తేమ శాతం వచ్చిన వాటిని వెంటనే తూకం వేసి లారీ లోడ్ చేసి సంబంధిత మిల్లులకు తరలించాలని ఆలస్యం చేయొద్దని అన్నారు.కొనుగోలు కేంద్రల లో ధాన్యం నిల్వ లు ఉండటానికి వీలు లేదని అన్నారు.ఈ కొనుగోలు కేంద్రంలో కరెంటు సదుపాయం లేదని కరెంట్ సౌకర్యం కల్పించాలని రైతులు కోరడంతో వెంటనే సంబంధిత కరెంటు ఎస్ఈ కి ఫోన్ చేసి సాయంత్రం లోపు విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు.రైతులు ఎవ్వరు కూడా బయట దళారులను నమ్మి ధాన్యంవిక్రయించవద్దని. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

## పసల విజయనంద్



**వలిగొండ, మహా :** వలిగొండ మండల పరిధిలోని చిత్తాపురం ఎంపీపీ ఎస్ దుప్పల్లి జెడ్పిహెచ్ఎస్ హైస్కూలు విద్యార్థులకు పసల విజయనంద్ సైకిళ్ల. ను గురువారం పీ ఆర్ టి యు టి ఎస్ జిల్లా సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి సమక్షంలో పంపిణీ చేశారు

# తహసిల్దార్ కార్యాలయం ముందు నిరసన

## బీజేపీ మండల శాఖ



**వలిగొండ, మహా :** రైతు సమస్యల పైన బిజెపి నిరసన కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ముందు గురువారం నాడు బిజెపి మండల అధ్యక్షులు బోళ్ల సుదర్శన్ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్ రెడ్డి హాజరైనారు జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాల కాలంలో రైతులకు ప్రజలకు ఇచ్చినటువంటి ఎలాంటి హామీల నెరవేర్చలేదని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సీఎన్ రెడ్డి బందారపు లింగస్వామి రాచకొండ కృష్ణ బంధారపు రాములు తానేష్ గౌడ్ పోలే నాగయ్య మైసొల్ల రామ్ నర్సు కొత్త రామ్ చందర్ తదితరులు పాల్గొన్నారు

# బిజెపి ఆందోళన .. ఉద్రిక్తత

## గోరక్షక్ కార్యకర్త మీద కాల్పుల ఘటనపై సీరియస్



**హైదరాబాద్ సిటీ, మహా :** హైదరాబాద్ నగర శివారులోని పోచారం ఐటీ కారిడార్‌లో గోసంరక్షణ కార్యకర్త సోనుసింగ్ అలియాస్ ప్రశాత్ సింగ్ పై కాల్పుల ఘటనను హిందూ సంఘాలతో పాటు బీజేపీ , బీజేవైఎం లు తీవ్రంగా ఖండించాయి. ఈ ఘటనకు బాధ్యులైన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠిన శిక్ష పడేలా చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై బీజేవైఎం గురువారం డీజీపీ కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చింది. అయితే, డీజీపీ కార్యాలయానికి బయలుదేరిన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుతో సహా ఆ పార్టీ నేతలను పోలీసుల అసెంబ్లీ ఎదుట అడ్డుకున్నారు. అనంతరం వారు డీజీపీ కార్యాలయంలో చొచ్చుకొళ్లేందుకు ప్రయత్నించగా.. రాంచందర్ రావుతో పాటు పలువురు నేతలను పోలీసులు అరెస్ట్ చేసి సమీప పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మీడియాతో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు మాట్లాడుతూ.. పోచారంలో గోరక్షక్ కార్యకర్తపై ఎంఐఎం దుండగులు తుపాకీతో కాల్పులు జరిపారని ఆరోపించారు. ఆ ఘటనను తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు.



# జూబ్లీహిల్స్‌లో ఎవరు గెలుస్తారో.. 14న మాట్లాడుకుందాం

## శంకరాహిల్స్ లో రేవంత్ ఏం చేస్తున్నారో తెలుసు

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్‌లో ఎవరు గెలుస్తారో.. నవంబర్ 14న మాట్లాడుకుందామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి అల్లుడు, మంత్రి కొడుకు పంచాయితీలో ఐఏఎస్ అధికారి రిజ్వీ బలి అయ్యారని చెప్పారు. రూ.500 కోట్ల టెండర్ల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్, మంత్రి జూపల్లి మధ్య పంచాయితీ వచ్చిందని ఆరోపించారు. మంచిరేవుల భూముల వ్యవహారంలో రేవంత్ తమ్ముడు, మంత్రి కొండా కుటుంబం మధ్య గొడవ జరిగిందన్నారు. రాష్ట్రంలో ఇంత జరుగుతుంటే.. కిషన్ రెడ్డి, బండి సంజయ్, అమిత్ షా ఎందుకు మాట్లాడటం లేదు? అని ప్రశ్నించారు. శంకరాహిల్స్ లో రేవంత్ ఏం చేస్తున్నారో, సర్వే నంబర్ 83లో ఏం చేయాబోతున్నారో అన్నీ తమకు తెలుసని అన్నారు. ముఖ్యమంత్రి, మంత్రుల మధ్య పంపకాల విషయంలో గొడవలతో తెలంగాణ పరువు పోయిందని విమర్శించారు. తన మాట వినలేదని.. మంచి అధికారి మీద మంత్రి జూపల్లి కక్ష తీర్చుకుంటున్నాడని ఆరోపించారు.

### ఖాకీ బుక్ ఎక్కడో డీజీపీ చెప్పాలి..

తెలంగాణలో నడుస్తుంది ఇందిరమ్మ రాజ్యం కాదని.. మాఫియా రాజ్యమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కుర్చీలో దావూద్ ఇబ్రహీం తమ్ముడు కూర్చున్నాడని మండియపడ్డారు. తన ఇంటి మీదకు ముఖ్యమంత్రే పోలీసులను పంపారని మంత్రి కుమార్తె చెప్పిందని తెలిపారు. తుపాకీ ఇచ్చింది రేవంత్.. పెట్టింది రోహిణ్ రెడ్డి అని మంత్రి కొండా కుమార్తె చెప్తుందన్నారు. మంత్రి కుమార్తె ఆరోపణలపై ఎందుకు విచారణ జరపటం లేదో డీజీపీ శివధర్ రెడ్డి చెప్పాలి? అనిప్రశ్నించారు. మంత్రి ఉత్తమ్ కు సంబంధం ఉందని మంత్రి కొండా సురేఖ కూతురు చేసిన ఆరోపణలపై ఉత్తమ్ స్టేట్మెంట్ ను రికార్డ్ చేయాలన్నారు. పింక్ బుక్, రెడ్ బుక్ లేదు.. ఖాకీ బుక్ మాత్రమే ఉందని శివధర్ రెడ్డి అన్నారని.. ఆ ఖాకీ బుక్ ఎక్కడో డీజీపీ చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ ది ఇల్లునా.. సెటిల్మెంట్ కు అడ్డానా? అని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

## ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



**తుర్కపల్లి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని వీరరెడ్డిపల్లి, మాదాపూర్ గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ హనుమంతరావుతో కలిసి ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గురువారం ప్రారంభించారు. అలాగే పలుగుల మైసమ్మ ఆలయం వద్ద సిసి రోడ్డు పనులను ప్రారంభించారు ఈ కార్యక్రమంలో RDO కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్ నాయక్ ,తహసీల్దారు,ఎంపిడిఓ తదితరులు పాల్గొన్నారు.

# టెన్త్ పరీక్ష ఫీజు షెడ్యూల్ విడుదల

## ఈనెల 30 నుంచి నవంబర్ 13 లోపు చెల్లింపుకు గడువు




**హైదరాబాద్, మహా:** తెలంగాణలో పదో తరగతి ఫైనల్ పరీక్ష ఫీజు చెల్లింపు తేదీలను డైరెక్టర్ స్కూల్ ఎడ్యుకేషన్ ప్రకటించింది. అక్టోబరు 30వ తేదీ నుంచి నవంబర్ 13 లోపు పాఠశాల హెడ్‌మాస్టర్లకు విద్యార్థులు ఫీజు చెల్లించాలని తెలిపింది. హెచ్ఎంలు ఆన్‌లైన్ ద్వారా నవంబర్ 14 లోపు ఫీజు చెల్లింపు చేయాలని, విద్యార్థుల డేటాను నవంబర్ 18 లోపు డీఈవోలకు అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. రూ.50 ఆలస్య రుసుముతో నవంబర్ 29 వరకు, రూ.200 ఆలస్య రుసుముతో డిసెంబరు 2 నుంచి 11వ తేదీవరకు, రూ.500 ఆలస్య రుసుముతో డిసెంబరు 15 నుంచి 29 వరకు పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించేందుకు విద్యార్థులకు అవకాశం కల్పించారు.

# బల్దియాలో ఎయిర్‌లైన్స్ గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్

## ఏర్పాటు చేయనున్న సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్

### సీఎం రేవంత్‌తో జరిగిన భేటీలో ఎయిర్‌లైన్స్ ప్రతినిధి బృందం వెల్లడి



**హైదరాబాద్, మహా:** అమెరికాకు చెందిన ప్రఖ్యాత విమానయాన సంస్థ సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్ తన గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో జరిగిన సమావేశంలో సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్ ప్రతినిధి బృందం ఈ నిర్ణయాన్ని వెల్లడించింది. ప్రపంచ పెట్టుబడులకు, సాంకేతిక ఆవిష్కరణలకూ కేంద్రంగా నిలుస్తోన్న హైదరాబాద్ నగరంలో గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్ స్థాపన నిర్ణయాన్ని ముఖ్యమంత్రి స్వాగతించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న సానుకూల విధానాలు, అభివృద్ధి లక్ష్యాలను సీఎం వివరించారు. ‘తెలంగాణ రైజింగ్ 2047’ విజన్‌లో భాగంగా, 2034 నాటికి తెలంగాణను $1 ట్రిలియన్, 2047 నాటికి $3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అండ్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ లారెన్ వుడ్స్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ టామ్ మెరిట్, హెడ్ లీగల్ కౌన్సిల్ జాసన్ షైయింగ్, హెచ్‌ఈఎక్స్ అడ్వైజరీ గ్రూప్‌కు చెందిన సార్థక్ బ్రహ్మ, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మేమేం చేయాలో.. నువ్వు చెప్పడం ఏంటి?



**ఢిల్లీ:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత్ ఏం చేయాలో ట్రంప్ చెప్పడం ఏంటని ఆయన ప్రశ్నించారు. ఇటీవల ట్రంప్ మాట్లాడుతూ.. ‘భారత్ రష్యా నుంచి చమురు కొనుగోళ్లను ఆపుతోంది’ అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను శశి థరూర్ ఖండించారు. ట్రంప్ అసత్యమైన, ఆధారాలు లేని వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. భారత్ ఇప్పటికీ రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందని, అది అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా జరుగుతోందని స్పష్టం చేశారు. భారత్ తన జాతీయ ప్రయోజనాల ప్రకారం నిర్ణయాలు తీసుకుంటుందని, అమెరికా అధ్యక్షుడు భారత్ తరఫున నిర్ణయాలు ప్రకటించడం అనవసరమని థరూర్ అన్నారు. ఇది భారత స్వతంత్రతను, విదేశాంగ విధానాన్ని అపహాస్యం చేయడమేనని ఆయన విమర్శించారు. విదేశాంగ వ్యవహారాల్లో అనుభవం కలిగిన నేతగా, శశి థరూర్ మాట్లాడుతూ ..భారత్ స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే దేశం. ఇతర దేశాల నాయకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయవచ్చు. కానీ భారత్ తరఫున నిర్ణయాలు ప్రకటించడం అనైతికం’అని అన్నారు.

# అమెరికాలో ట్రక్కు బీభత్సం.. భారతీయుడి అరెస్ట్



**కాలిఫోర్నియా:** అమెరికాలో ఓ భారతీయుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కాలిఫోర్నియాలో జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో ముగ్గురు మృతికి కారణమయ్యాడంటూ జశన్‌ప్రీత్ సింగ్ (21) అనే యవకుడిని అదుపులోకి తీసుకున్నారు. అమెరికా వార్తా కథనాల ప్రకారం.. అతడు అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించాడని.. డ్రగ్స్ మత్తులో ఉన్నట్లు వెల్లడైంది. 2022 మార్చిలో సింగ్.. అమెరికా దక్షిణ సరిహద్దును అక్రమంగా దాటినట్లు సమాచారం. కాలిఫోర్నియాలోని బోర్డర్ పెట్రోల్ (Border Patrol) ఏజెంట్లు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద చట్టబద్ధమైన ప్రతాలు లేవని యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ స్పష్టం చేసింది. అప్పటి ప్రభుత్వం తీసుకొచ్చిన ‘ఆల్టర్నేటివ్ టు డిటెన్షన్’ విధానం కారణంగా కొన్ని రోజుల్లోనే అతడు జైలు నుంచి విడుదలయ్యాడు. కాలిఫోర్నియాలో జరిగిన ట్రక్కు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా.. పలువురు గాయపడ్డారు. ఈ ఘటనలో జశన్‌ప్రీత్ సింగ్ కూడా గాయపడ్డాడు. ట్రక్ నడుపుతోన్న సమయంలో డ్రగ్స్ మత్తులో ఉన్న అతడు.. ట్రాఫిక్‌లో కూడా బ్రేక్స్ వేయలేదని పోలీసు అధికారులు తెలిపారు. అక్రమ వలసదారులైన ట్రక్ డ్రైవర్లు అమెరికాలో ప్రమాదాలకు కారణమవుతున్న ఘటనల్లో ఇది తాజాది. గత ఆగస్టులోనూ ఇదే తరహా ఘటన జరిగిన సంగతి తెలిసిందే. ఫ్లోరిడాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. 2018లో అక్రమంగా అమెరికాలోకి ప్రవేశించిన హర్జిందర్ సింగ్ ఆ ఘటనకు కారకుడు.



# ప్రభాస్ బ్రాండ్..

## రూ.7 వేల కోట్ల మార్కెట్

"ప్రభాస్ పేరు కాదు, బ్రాండ్." ఎందుకంటే ఆయన సినిమాకు ఫ్లాప్ టాక్ వచ్చినా సరే వందల కోట్ల కలెక్షన్స్ వసూలు చేయడం సాధారణం. ఇది ప్రభాస్ పవర్ ఏంటో సూచిస్తుంది. అత్యధిక బడ్జెట్ సినిమాలు, బాక్సాఫీస్ రికార్డులు, అంతర్జాతీయ స్థాయిలో ఫ్యాన్ ఫాలోయింగ్ ఇవన్నీ ప్రభాస్ సినీ ప్రయాణంలో సాధారణ విషయాలే. కానీ, ఆయన వ్యక్తిత్వం మాత్రం అసాధారణం. మీడియాకు దూరంగా ఉంటూనే తన పనితోనే మాట్లాడే బాహుబలి.. సినిమా ఏదైనా సరే ప్రతి పాత్రలో తన శ్రమను, నిబద్ధతను చూపిస్తారు. తెలుగు సినిమా చరిత్రలో ప్రభాస్ ఒక విప్లవాత్మక అధ్యాయం. ఆయన మాటలు తక్కువ, కానీ ప్రభావం ఎక్కువ. బాహుబలి రూపంలో భారతీయ సినిమాకు ఒక కొత్త దిశను చూపించారు. ప్రభాస్ అంటే కేవలం నటుడు కాదు – ఒక భావన, ఒక స్ఫూర్తి, ఒక క్రేజ్. ఆయన సినిమాలు విడుదలయ్యే రోజు, అభిమానులకు పండుగ. ఆయన పుట్టినరోజు అంటే సేవా కార్యక్రమాలు, సోషల్ మీడియా సందడి కనిపించడం సహజం. నేడు ప్రభాస్ పుట్టినరోజు జరుపుకుంటున్నారు.

### ఛత్రపతితో మొదలు

ప్రముఖ నటులు దివంగత కృష్ణంరాజు వారసుడిగా 2002లో ఈశ్వర్ సినిమాతో ప్రభాస్ తెరంగేట్రం చేశారు. ఈ సినిమా నటుడు విజయ్ కుమార్ కుమార్తె శ్రీదేవికి కూడా తెలుగులో తొలి సినిమా. ఈ సినిమా విజయం సాధించినా ఆ తర్వాత 2003లో విడుదలైన 'రాఘవేంద్ర' సినిమా పరాజయం పాలైంది. 2004లో త్రిష సరసన నటించిన 'వర్షం' సినిమా ప్రభాస్ మంచి గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత ప్రభాస్ అడవి రాముడు, చక్రం సినిమాల్లో నటించాడు. ఈ సినిమాల ద్వారా ప్రభాస్‌కు నటుడిగా పేరు లభించినా పరాజయం పాలయ్యాయి. 2005లో ఎస్. ఎస్. రాజమౌళి దర్శకత్వంలో ప్రభాస్- శ్రియా కాంబోలో 'ఛత్రపతి' వచ్చింది. ఆ సినిమా బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. ఈ సినిమాతో ప్రభాస్‌కు ఎక్కడలేని ఫ్యాన్ బేస్‌ను క్రియేట్ చేసింది. దీంతో తెలుగు పరిశ్రమలో టాప్ హీరోల లిస్ట్‌లో ప్రభాస్ చేరిపోయాడు.

## ప్రభాస్ లైఫ్‌లో ఇవన్నీ ఎంతో ప్రత్యేకం

- ప్రముఖ మ్యూజియం మేడమ్ టుసాడ్స్‌లో మైనపు విగ్రహం కలిగిన మొదటి దక్షిణాది స్టార్‌గా ప్రభాస్ గుర్తింపు పొందారు.
- కేవలం 'బాహుబలి' ప్రాజెక్టు కోసం ఐదేళ్లు కేటాయించడం.. ప్రభాస్ 2014లోనే తొలిసారి హిందీ సినిమాలో మెరిశారు. అజయ్ దేవగణ్, సోనాక్షి సిన్హా కలిసి నటించిన 'యాక్షన్ జాక్సన్'లో అతిథిగా కనిపించారు. కల్కి సినిమా ఆరు రోజుల్లో రూ. 700 కోట్ల వసూలుతో 2024లో అత్యధిక కలెక్షన్లు సాధించిన భారతీయ చిత్రంగా నిలిచింది. రష్యన్ ఆడియన్స్ హార్ట్ అవార్డు పొందిన రెండవ భారతీయ నటుడిగా ప్రభాస్ నిలిచారు, ఇది ఆయనకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చింది
- COVID19 సమయంలో CM రిలీఫ్ ఫండ్‌కు రూ. 4 కోట్లు విరాళంగా ప్రభాస్ ఇచ్చారు. ఇది తెలుగు సినీ పరిశ్రమలో అత్యధిక విరాళంగా గుర్తించబడింది. స్టార్‌డమ్ సొంతం చేసుకుని ఎన్నో ఏళ్లయినా ప్రభాస్ ప్రకటనలకు కాస్త దూరంగా ఉన్నారు. 2015లో తొలిసారి ఓ కారు ప్రచారంలో భాగంగా వాణిజ్య ప్రకటనలో నటించారు. రూ. 100 కోట్ల రెమ్యునరేషన్ తీసుకున్న తొలి నటుడిగా రికార్డుకెక్కాడు. ప్రభాస్ ఆదిపురుష్ కోసం రూ. 100 నుంచి 120 కోట్లు తీసుకున్నట్లు తెలుస్తోంది. బాహుబలి 2 సినిమా భారతీయ సినిమా చరిత్రలో మొదటి వెయ్యి కోట్లు దాటిన చిత్రం. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా సుమారు 2000 కోట్లు వసూలు చేసింది.
- మిర్చి సినిమాకు ఉత్తమనటుడిగా 2013లో నంది అవార్డు దక్కించుకున్న ప్రభాస్
- తన 1650 ఎకరాల ఖాజిపల్లి రిజర్వ్ ఫారెస్ట్ భూమిని దత్తత తీసుకొని తన తండ్రి పేరు మీద ఎకో పార్క్ కు కావాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.
- ప్రభాస్ నటుడు కాకపోయుంటే..? హోటల్ రంగంలో స్థిరపడేవారు..
- ప్రభాస్‌కు ఏపీలో శ్రీశైలం అంటే ఎంతో ఇష్టం
- **ఇష్టమైన పాట:** 'వర్షం'లోని 'మెల్లగా కరగనీ రెండు మనసుల దూరం'.
- **నటులు:** షారుఖ్‌ఖాన్, సల్మాన్‌ఖాన్, రాబర్ట్ డి నిరో, జయసుధ, శ్రియ, త్రిషలకు ప్రభాస్ అభిమాని.

## ప్రభాస్.. రూ. 7 వేల కోట్లు

సలార్, కల్కి తర్వాత ప్రభాస్ మార్కెట్ ప్రపంచవ్యాప్తంగా భారీగా పెరిగిపోయింది. ఒకప్పుడు టాలీవుడ్, బాలీవుడ్ మధ్య దూరం ఎక్కువగా ఉండేది. మన సినిమాలంటే హిందీ బెల్ట్‌లో చిన్నచూపు. కానీ, ప్రభాస్ రాకతో తెలుగు సినిమాకు గౌరవం తీసుకొచ్చాడు. అతను వేసిన దారిలోనే నేడు మన చిత్రాలన్నీ హిందీలో మెప్పిస్తున్నాయి. ప్రస్తుతం ఇండియన్ బాక్సాఫీస్ వద్ద ప్రభాస్‌తో వేల కోట్ల రూపాయలు కొల్లగొట్టనున్నారు. ఈ క్రమంలో బాహుబలి: ది ఎపిక్ పేరుతో తన ఫ్రాంచైజీ చిత్రాన్ని ఒకే భాగంగా ఈ నెల 31న విడుదల చేస్తున్నారు. ఆ తర్వాత రాజాసాబ్, దర్శకుడు హను రాఘవపూడితో మరో చిత్రం లైన్‌లో ఉంది. స్పిరిట్, కల్కి-2, సలార్-2 వంటి సినిమాలు కూడా లైన్‌లో ఉన్నాయి. ఇక మీద ఏడాదికి రెండు సినిమాలు విడుదలయ్యేలా ప్రభాస్ ప్లాన్ చేస్తున్నారట. అందుకే ఇలా ఒకేసారి రెండు మూడు చిత్రాల్లో నటిస్తూ, లైనప్‌లో మరో రెండు మూడు సినిమాలు ఖరారు చేసి, బిజీ బిజీగా ఉంటున్నారు ప్రభాస్. ఇలా ప్రభాస్ నటిస్తున్న 5 సినిమాలు కూడా ఈ రెండు ఏళ్లలోనే విడుదల కావచ్చు. దీంతో బాక్సాఫీస్ వద్ద ఆయన ఐదు చిత్రాలకు సంబంధించి ఏకంగా రూ. 7వేల కోట్లు పైగానే మార్కెట్ చేయవచ్చని ఒక అంచనా ఉంది. ఈ లెక్కలు తలుచుకుంటేనే వామ్మో అనిపిస్తోంది కదా.. అయినా ఇదే నిజం.




## ప్రభాస్, హను కొత్త సినిమా టైటిల్ ప్రకటన

ప్రభాస్, హను రాఘవపూడి కొత్త సినిమా టైటిల్‌ను ప్రకటించేశారు. నేడు (అక్టోబర్ 23) డార్లింగ్ పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు చెబుతూ ఒక పోస్టర్‌ను విడుదల చేశారు. ముందుగా అనుకున్నట్లుగానే ఈ మూవీకి "ఫౌజీ" అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా రానుంది. మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. 1930వ దశకంలో జరిగిన సంఘటనల ఆధారంగా వాటికి కొంత ఫిక్షన్ జోడించి ఈ మూవీని తెరకెక్కించనున్నారు. ఇందులో కొత్త భామ ఇమాన్వి కథానాయికగా నటిస్తోంది. మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్, జయప్రద వంటి స్టార్స్ నటిస్తున్నారు. మన చరిత్రలోని దాగి ఉన్న అధ్యాయాల నుండి ఒక సైనికుడి ధైర్య కథను ఫౌజీలో చూపిస్తామని దర్శకుడు హను రాఘవపూడి చెప్పారు. ప్రభాస్‌ను ఫౌజీగా పరిచయం చేయడంలో తనకు చాలా గర్వంగా ఉందన్నారు. 'ఇప్పటివరకు ఈ ప్రయాణం మరపురానిది.. ఫౌజీ నుంచి ఈ జర్నీ మరింత పెద్దదిగా ఉంటుందని హామీ ఇస్తున్నా' అంటూ హను పోస్ట్ చేశారు. ఈ సినిమా షూటింగ్ కూడా ఇప్పటికే సగంపైగానే పూర్తి అయింది. ఫస్ట్ షెడ్యూల్ తమిళనాడులో ప్రారంభమైంది. కారైకుడి, మధురై లొకేషన్స్‌లో ప్రభాస్‌తో పాటు ప్రధాన తారాగణం పాల్గొనగా కీలక సన్నివేశాల చిత్రీకరణ చేశారణ టాక్. ఇక ఈ సినిమాలో ఓ బ్రాహ్మణ యువకుడి పాత్రలో ప్రభాస్ కనిపిస్తారని, సినిమాలో దేవీపురం అనే బ్యాక్‌డ్రాప్ ఉంటుందనే ప్రచారం జరుగుతోంది.

# బ్రేకప్..

## గుండెనిండా బాధ..

తెలుగు, తమిళం, హిందీ భాషల్లో నటిస్తూ ఫుల్ బిజీగా ఉంది రష్మిక మందన్నా. ఇటీవలే హారర్ కామెడీ థ్రిల్లర్ థామాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమాకు పాజిటివ్ రెస్పాన్స్ వస్తోంది. ఇకపోతే ఈ మధ్యే తెలుగు హీరో విజయ్ దేవరకొండతో రష్మిక ఎంగేజ్‌మెంట్ జరిగింది. దీనికంటే ముందు రష్మికకు లవ్ బ్రేకప్ అనుభవం ఉన్న విషయం తెలిసిందే. గతంలో కన్నడ హీరో రక్షిత్ శెట్టితో ప్రేమాయణం సాగించి నిశ్చితార్థం కూడా జరుపుకుంది. పెళ్లి బంధంతో ఒక్కటవుతారనుకుంటే.. బ్రేకప్ చెప్పుకుని ఎవరి దారి వారు చూసుకున్నారు.

### మగవారిలా గడ్డం పెంచలేం

ఇటీవల ఓ భేటీలో రష్మిక.. ప్రేమ, బ్రేకప్ గురించి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ప్రేమ, బ్రేకప్‌లో విషయంలో మహిళల కంటే పురుషులే ఎక్కువగా బాధపడతారనే మాటను అంగీకరించనంది. బ్రేకప్ వల్ల మహిళలే ఎక్కువ బాధ, వేదనకు గురవుతున్నారని పేర్కొంది. తమ బాధను వ్యక్తం చేయడానికి మగవారిలా గడ్డం పెంచడం, మద్యం తాగడం వంటివి చేయలేమంది. మనసులోనే బాధను భరిస్తుంటామని, బయటకు వ్యక్తం చేయలేమని తెలిపింది. ఆమె వ్యాఖ్యలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. కాగా రష్మిక మందన్నా ఉమెన్ సెంట్రిక్ పాత్రలో నటించిన ది గర్ల్ ఫ్రెండ్ చిత్రం నవంబర్ 7న విడుదల కానుంది.



EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034